సాక్షి చిత్తూరు
I
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



స్వర్ణరథంలో వరసిద్ధుడి విహారం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు స్వర్ణరథంలో ఆలయ మాడవీధుల్లో విహరించారు. - IIలో



కుప్పంలోనూ గెలుపు సాధ్యమే

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే కుప్పంలోనూ గెలుపు సాధ్యమేనని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. - IIలో



సోఫాల ఫ్యాక్టరీ దగ్ధం

సోఫాల ఫ్యాక్టరీ దగ్ధమై రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన వి.కోట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. - IIలో

చిత్తూరు జిల్లా.. పరిశ్రమల కళ

కరువు సీమగా ఖ్యాతిగాంచిన చిత్తూరు నేడు పారిశ్రామికంగా పరుగులు పెడుతోంది. ప్రభుత్వం పలు రాయితీలు, సకాలంలో అనుమతులివ్వడంతో ఇక్కడికి పరిశ్రమలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఉపాధి అవకాశాలకు కొదవ లేకుండా పోయింది.

- వెల్లువెత్తుతున్న పరిశ్రమలు
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి
- అభివృద్ధి పథంలో జిల్లా పరుగులు

సాక్షి, చిత్తూరు/పుంగనూరు: పారిశ్రామికాభివృద్ధిలో చిత్తూరు జిల్లా దూసుకుపోతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత 5 వేల పైచిలుకు పరిశ్రమలు స్థాపించడంతో సుమారు 40 వేల మందికి ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో పుంగనూరులో కొత్త పరిశ్రమలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమలివీ..

జిల్లాలో ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమలు 480, మామిడి గుజ్జు 34, పవర్ లూమ్స్ 6 వేలకు పైగా, డెయిరీ 25, చిల్లింగ్ యూనిట్లు 80, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లు 7, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లు చిన్నవి 35, రెండు చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లు, రెండు అల్యూమినియం సంస్థలు, ప్లాస్టిక్ పరిశ్రమలు(డ్రిప్) 20, మూడు పెద్ద తరహా గార్మెంట్స్, అమర్ రాజా బ్యాటరీస్, గ్రావిటీ ఇండియా లిమిటెడ్, కోల్డ్ స్టోరేజ్ 10తోపాటు లెదర్ పరిశ్రమలు స్థాపించారు.





గంగాధర నెల్లూరు సమీపంలోని పుత్తా లెదర్స్

పుంగనూరు కేంద్రంగా పరిశ్రమల వెల్లువ

పుంగనూరు కేంద్రంగా పరిశ్రమలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రూ.4,640 కోట్లతో 800 ఎకరాల్లో జర్మనీకి చెందిన పెప్పర్ సంస్థ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు, బ్యాటరీల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. దీనిద్వారా 8,100 మందికి ఉపాధి లభించనున్నది. దీనికి అనుబంధంగా మరో 7 కంపెనీలను ఇక్కడ ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది.

- గత ఏడాది పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద ఫెరాలాయ్ స్టీల్ (శ్రీకాళహసి) పైపుల ఫ్యాక్టరీ రూ.500 కోట్లతో పనులు ప్రారంభించింది.
- అదే గ్రామంలో రూ.180 కోట్ల పెట్టుబడితో 'ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ (ల్యాంకో)' పైపుల తయారీ పరిశ్రమ కోసం భూ సేకరణ జరిగింది.
- పుంగనూరులో రూ.52 కోట్లతో 12 ఎకరాల్లో గ్యాస్ సిలిండర్ల తయారీ పరిశ్రమ స్థాపనకు అనుమతిచ్చారు.



పలమనేరు మండలం గుండ్రాజు పల్లె వద్ద ఏర్పాటైన అప్పరల్స్ పరిశ్రమ

జిల్లాలో కొత్త పరిశ్రమలివీ

- పలమనేరు సమీపంలోని ధనరాజపల్లె వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో 2020 మార్చిలో రూ.20 కోట్లతో విశ్వ గార్మెంట్స్ పరిశ్రమ స్థాపించారు. ఇందులో 1200 మంది ఉపాధి పొందుతున్నారు.
- శ్రీరంగరాజపురం మండలం కొటార్లపల్లె సమీపంలో రూ. 50 కోట్లతో 1.60 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బెంగళూరుకు చెందిన డీవీ గ్రూఫ్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి 2022లో భూమి పూజ చేశారు.
- పూతలపట్టు మండలం తేనెపల్లెలో బ్యాటరీలు, గ్యాస్ సిలిండర్లకు వాడే పరికరాల తయారీకి మంగళ్ ఇండ్రస్టీస్ స్థాపించారు. ఇందులో వెయ్యి మందికి ఉపాధి లభిస్తోంది.
- గుడుపల్లె మండలంలో రూ.30 కోట్లతో పశువుల దాణా తయారీ(ఓరగేటు) పరిశ్రమ స్థాపనకు 8 ఎకరాల స్థలం కేటాయించారు.
- నింద్ర మండలంలో రూ.29.05 కోట్లతో అమ్మయప్పన్ టెక్స్‌టైల్ పరిశ్రమ నిర్మాణ పనులు సాగుతున్నాయి. సుమారు 2,300 మందికి ఉపాధి దొరకనుంది.
- విజయపురం మండలం కోసలనగరంలో రూ.5 కోట్ల పెట్టుబడితో బాలాజీ పెట్రోల్ , కెమికల్ పరిశ్రమ స్థాపించనున్నారు.
- విజయపురంలో మండలం కోసలనగరంలో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో ప్లాస్టిక్ ప్యాకింగ్ వస్తువుల తయారీ పరిశ్రమ 'ఫిట్ టూ పాక్' స్థాపనకు అనుమతిచ్చారు.

సంవత్సరం	పరిశ్రమల సంఖ్య	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉ.పొం.సం
2019-20	634	1,353	8,646
2020-21	263	1,250	2,704
2021-22	673	1,212	4,371
2022-23	3,766	4,105	23,504
నవంబరు వరకు మొత్తం	5,356	7,920	39,225

నోట్: ఉ.పొం.సం: ఉపాధి పొందినవారి సంఖ్య

ఇండస్ట్రియల్ పార్క్‌కు భూ సేకరణ

జిల్లాలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు పలమనేరు నుంచి పుంగనూరు వరకు 4,382 ఎకరాలతో "నోడ్" పేరుతో ఈ పారిశ్రామిక వాడ ఏర్పాటు కానుంది. ఇందుకు భూ సేకరణ జరుగుతోంది.

- కాగితాలకే పరిమితమైన వీకేఆర్‌పురంలో ఇండస్ట్రియల్ పార్క్‌కు ప్రస్తుత ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 235.03 ఎకరాల భూ సేకరణ చేసి, రూ.6.85 కోట్ల నష్టపరిహారం చెల్లింపు జరిగింది. ఈ భూములను 2023, జూన్ ఒకటో తేదీన నగరి తహసీల్దార్ ఏపీఐఐసీకి అప్పగించారు.

సకాలంలో అనుమతులు



రెండేళ్ల కిందట ప్రారంభించిన పల్ప్ ఇండస్ట్రీ పనులు జూన్‌లో పూర్తి చేశాం. జిల్లాలో మామిడి, బొప్పాయి, పైనాపిల్, టమాట తదితర ఉత్పత్తులు ప్రాసెసింగ్ చేయడానికి ఈ పరిశ్రమ ఏర్పాటు చేశాం. కంపెనీ స్థాపనకు అన్ని రకాల అనుమతులు సకాలంలో మంజూరు చేశారు. –జి.ప్రకాష్‌రెడ్డి, జీసీర్ ఇండస్ట్రీ, పైమాఘం, తవణంపల్లె మండలం

1200 మందికి ఉపాధి



మా పరిశ్రమకు గండ్రాజుపల్లె ఇండస్ట్రియల్ పార్క్‌లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. దీనికి తోడు అనుమతులన్నీ సకాలంలో ఇవ్వడంతో 2019 నుంచి ఉత్పత్తి ప్రారంభించాం. ప్రస్తుతం 1200 మందికి పైగా పనిచేస్తున్నారు. ఇతర దేశాలకు చెందిన ఆర్డర్లపై ఆధారపడి ఫ్యాక్టరీ నడుస్తోంది. –మైథిలి, ప్రొప్రయిటర్, విశ్వ అప్పరల్స్, గండ్రజుపల్లె, పలమనేరు

సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు



సింగిల్ డెస్క్ విధానంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వీలైనంత త్వరగా అనుమతులు ఇస్తున్నాం. ఈ విధానం అమలుతో జిల్లాకు ఇప్పటికే పలు పరిశ్రమలు వచ్చాయి. జిల్లాలో జాతీయ రహదారుల పనులు పూర్తి అయితే మరిన్ని పరిశ్రమలు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. – షణ్మోహన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

నిరుద్యోగ నిర్మూలన



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పరిశ్రమల ఏర్పాటు చేసి, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా జర్మన్‌కు చెందిన పెప్పర్ కంపెనీ పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమ స్థాపనకు ఒప్పందం కుదుర్చుకున్నాం. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తాం. – పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

అభివృద్ధి పరుగులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరు అభివృద్ధికి రూ. వందల కోట్లు కేటాయిస్తున్నారు. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పుంగనూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాలను కేటాయించాం. దీంతో పుంగనూరులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. జిల్లా వ్యాప్తంగా సరికొత్త పరిశ్రమల ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. – డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్రమంత్రి

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈ నెలకు సంబంధించి ప్రభుత్వం 1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకుగాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, కందిపప్పు, గోధుమ పిండితోపాటు చక్కెర, రాగులు అవసరమైన మేరకు సరఫరా చేశామన్నారు. కార్డుదారులు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దే సరుకులను పొందవచ్చని పేర్కొన్నారు.

న్యుమోనియా కేసులపై ఆరా

చిత్తూరురూరల్: రాష్ట్రంలో న్యుమోనియా కేసులు పెరుగుతుండడంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వాస్పత్రి వైద్యులను అప్రమత్తం చేస్తోంది. ఆస్పత్రికి వచ్చే వారిలో న్యుమోనియా లక్షణాలు కనిపిస్తే వెంటనే తగిన వైద్యం అందించాలని సూచించింది. జిల్లా ప్రభుత్వాస్పత్రుల వైద్యులు, అధికారులతో గురువారం రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ అధికారులు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ న్యుమోనియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ వైద్య సేవలు అందించాలన్నారు. లక్షణాల తీవ్రత ఆధారంగా చికిత్స అందించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేసుల సంఖ్య పెరగవచ్చని భావిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఆస్పత్రిల్లో ప్రత్యేక వార్డు కేటాయించాలని సూచించారు. అనంతరం చిత్తూరు జిల్లాలో న్యుమోనియా కేసులపై ఆరా తీశారు. నివేదికలు అడిగి తీసుకున్నారు. వారి ఆదేశాలతో జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హెచ్‌ఐవీపై మరింత అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: హెచ్‌ఐవీ(ఎయిడ్స్ వ్యాధి)పై మరింత అవగాహన కల్పిద్దామని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవిత భాగస్వామితో కాకుండా ఇతరులతో సురక్షితం కానీ శృంగారంలో తరచూ పాల్గొనడంతో హెచ్‌ఐవీ బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. అలా తన భాగస్వాములనూ ఈ వ్యాధి బారిన పడేస్తున్నారని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు బాధితులకు బాసటగా నిలిచి ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. జాగ్రత్తలతో ఆయుష్షు పెంచుకునేలా చేస్తోందన్నారు. శుక్రవారం జిల్లాలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ మహమ్మారిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బంది, వైద్యులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని న్యాయసేవా సదన్ భవనంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలతో నిర్వహిస్తున్న అదాలత్‌లో రెవెన్యూ, బ్యాంకులు, చిట్‌ఫండ్, బీమా సంస్థలతో పాటు ఇతర కేసులను సైతం రాజీ చేసుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లో అదాలత్ జరుగుతుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన జాతీయ అదాలత్‌లో దాదాపు 18 వేలకు పైగా కేసులను పరిష్కరించడంతోపాటు రూ.34 కోట్ల విలువైన నగదు సెటిల్ చేశామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆధ్వర్యంలో నిర్వహించే అదాలత్‌లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా కూడా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ చేసుకోదగిన కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు.

జగనన్నకు మరోసారి పట్టం కడదాం

- నాలుగున్నరేళ్లలోనే అద్భుతాలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రధాని మోదీ ప్రశంసలే ఇందుకు నిదర్శనం
- గడప గడపలో మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కడదామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డు నందిమంగళం సచివాలయ పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ, కోనప్పగుంట గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న తన నాలుగున్నరేళ్ల పాలనలోనే అద్భుతాలు చేశారని చెప్పారు. ఇందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలే నిదర్శనమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని, అందుకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా? అని ప్రశ్నించారు. పలువురు మహిళలు తామూ సిద్ధమంటూ ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఇలా గ్రామాలకు గ్రామాలు ఒక్కతాటిపై నిలబడి అభివృద్ధిని, సంక్షేమాన్ని మరింత సాధించుకోవాలని సూచించారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. ఇలా చరిత్ర సృష్టించడానికి జగనన్న తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థే ప్రధాన కారణమన్నారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు అందుతున్నాయని తెలిపారు. ఈ నిధులను అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇలా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రతి ఇంటా సంక్షేమం అందిస్తూ మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత మన జగనన్నకే దక్కిందన్నారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. స్థానికంగా తన దృష్టికి వచ్చిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్, కౌన్సిలర్లు బాలాజీ, ఏకాంబరం, పార్టీ నాయకులు రవీంద్ర, మురళీరాజు, చిరంజీవి, కడియాలనాయుడు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా



అవ్వకు మంత్రి రోజా ఆప్యాయ పలకరింపు

యువతకు నైపుణ్యం అవసరం

ఐరాల: గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్యం అవసరమని, ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా జాబ్స్ మేనేజర్ సరితారెడ్డి అన్నారు. స్త్రీశక్తి భవనంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, సాధికార అభివృద్ధి సంస్థల ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిత్తూరు స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలో నడుపుతున్న రిటైల్ సేల్స్, సూపర్‌వైజర్ కోర్సుల్లో ప్రవేశం, తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో అడ్మిషన్‌పై అవగాహన కల్పించారు.

96 మందికి నోటీసులు



డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు పాఠశాలల్లో అటెండెన్స్ నమోదు చేయని 96 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ కేడర్ ఉద్యోగులు తప్పనిసరిగా నిర్ణీత సమయంలో అటెండెన్స్ నమోదు చేయాల్సిందేనన్నారు. సమయపాలన పాటించాలని ఎంత చెప్పినా పలువురిలో మార్పు రావడం లేదన్నారు. ప్రస్తుతం 96 మందికి నోటీసులు ఇస్తున్నామని, తీరు మారకపోతే సస్పెండ్ చేయడం ఖాయమని హెచ్చరించారు. డీవైఈఓ, ఎంఈఓలు తప్పనిసరిగా పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. అనంతరం నివేదికలను డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు. డిసెంబర్ నెలాఖరులోపు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం కచ్చితంగా రావాలని తెలిపారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమ్మెటివ్-1 పరీక్షలు పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు జవాబు పత్రాలు దిద్ది ప్రొగ్రెస్‌కార్డులను అందజేయాలని తెలిపారు. సీఆర్సీ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేసి, నివేదికలు పంపాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ ఆదేశించారు.

ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: ఓటరు నమోదుకు ఈ నెల 2, 3 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు శిబిరాల్లో బీఎల్వోలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడైనా గైర్హాజరైతే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ల నుంచి అభ్యంతరాలు, ఓటు నమోదు దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఫారం 6 నమోదు చేసి ఓటరుగా నమోదు చేయించాలని చెప్పారు. ప్రతి పోలింగ్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక శిబిరాల నిర్వహణను తహసీల్దార్, ఆర్డీఓ, ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

వినాయకునికి దేశీయ ఆవుదూడ బహూకరణ



ఆలయాధికారులకు ఆవుదూడను అప్పగిస్తున్న దాత, కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): తిరుపతికి చెందిన సుబ్రమణ్యం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి గోశాలకు దేశీయ ఆవు దూడను బహూకరించారు. దాత కుటుంబసభ్యులతో కలసి కాణిపాకం విచ్చేసి, ఆవు దూడను ఆలయాధికారులకు అప్పగించారు. దాతతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌చార్జి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ప్రముఖులు



వినాయకుని సేవలో మాజీ మంత్రి, సినీ నటుడు అశోక్‌కుమార్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం మాజీ మంత్రి గంటా శ్రీనివాస్, సినీ నటుడు అశోక్ కుమార్ విచ్చేయగా ఆలయాధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మనబడి..సౌకర్యాల ఒడి

జనవాక్కు

ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మనబడి నాడు–నేడు పథకం అమలు చేసింది. స్కూళ్ల అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఫలితంగా చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో సకల సౌకర్యాలు వనగూరాయి. ఇది గొప్ప విషయం అని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. నాడు–నేడు పథకం అమలుపై తల్లిదండ్రులు, టీచర్ల అభిప్రాయాలు వారి మాటల్లోనే.. – చిత్తూరు కలెక్టరేట్



పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రీన్‌చాక్‌బోర్డు

నా పిల్లలను చదివించాలన్న తపన ఏర్పడింది



మాది పెనుమూరు మండలం విడిదిపల్లె. నాకు ఇద్దరు అమ్మాయిలు. నేను చదువుకోకపోయి నా పిల్లలను చదివించుకోవాలనే తపన నాలో ఏర్పడింది. అయితే ఆర్థిక ఇబ్బందులతో పిల్లల్ని ఎలా చదివించుకోవాలనుకుంటున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అధికారాన్ని చేపట్టారు. పేదల ఉన్నత చదువుల కోసం అమలు చేసిన పథకాలతో పాటు, పాఠశాలలను ఆధునీకరించారు. గతంలో మా ఊళ్లో ఉండే ప్రభుత్వ పాఠశాల అధ్వానంగా ఉండేది. మా పిల్లలను చదివించాలన్న ఆసక్తి ఉండేది కాదు. ప్రస్తుతం అధునాతన హంగులతో బడి కొత్తరూపు సంతరించుకుంది. ప్రైవేట్ బడికన్నా మా సర్కారు బడే ఇప్పుడు చాలా బాగుంది.

– పద్మావతి, విద్యార్థిని తల్లి, విడిదిపల్లె. పెనుమూరు మండలం

జగనన్న సర్కారులో పాఠశాలకు మహర్దశ



గతంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని పట్టించుకున్న ప్రభుత్వమే లేదు. ప్రస్తుత సీఎం పాలనలో సర్కారు బడులు ఎంతో మెరుగయ్యాయి. పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. స్కూళ్ల అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు పెట్టిన సీఎంను నేను ఇంత వరకు చూడనేలేదు. సర్కారు బడుల్లో విద్యార్థులు ట్యాబ్ చదువులు చదువుతారని ఊహించనలేదు. సీఎం ఆశయాల మేరకు విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన చేసి మెరుగైన విద్యనందిస్తున్నాం. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను

– చలపతిరావు, గణిత ఉపాధ్యాయుడు, కత్తెరపల్లె, కార్వేటినగరం

నాడు–నేడుతో మారిన విద్యార్థుల భవిత



నాడు–నేడు పథకంతో విద్యార్థుల భవిష్యత్ మారుతోంది. సర్కారు బడులు ఇంతలా మారుతాయని నా ఇన్నేళ్ల సర్వీసులో అనుకోనేలేదు. సర్కారు బడుల్లో అమలు చేసిన నాడు–నేడు పథకంతో అడ్మిషన్లు పెరిగాయి. నైపుణ్యాలు పెరిగి, విద్యార్థులు ప్రపంచంతో పోటీపడే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇదంతా సీఎం దూరదృష్టితోనే సాధ్యమైంది.

– జయరాజ్, టీచర్, సంగనపల్లె, గుడుపల్లె మండలం


ప్రభుత్వ బడి మెరుగుపడింది



నాడు–నేడు పథకంతో మా పాఠశాల మరింత మెరుగుపడింది. మునుపటి కంటే ఇప్పుడు చాలా బాగుంది. అదనపు తరగతి గదులు, ఆధునికీకరించిన తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగది చూడ ముచ్చటగా ఉన్నాయి. అంతే కాకుండా విద్యార్థులకు డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు నేలపైన కూర్చోకుండా నాణ్యమైన డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఇలాంటి అభివృద్ధి గతంలో ఎప్పుడూ చూడలేదు.

–గురప్ప, పీఈటీ, పన్నూరు జెడ్పీహెచ్‌ఎస్, విజయపురం మండలం

పచ్చికాపల్లంలో దొంగలు హల్‌చల్



దుండగులు పగులగొట్టిన షట్టర్ తాళాలు

వెదురుకుప్పం: దొంగలు హల్‌చల్ చేసి స్థానికులను భయాందోళనకు గురి చేసిన సంఘటన పచ్చికాపల్లంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పచ్చికాపల్లంలో హరిత జ్యుయలరీలో చోరీ చేసేందుకు గుర్తుతెలియని దుండగులు దుకాణం షట్టర్‌ను తీసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అలికిడి రావడంతో స్థానికులు మేల్కొని, అక్కడికి చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం.. ఒకరి మృతి



వివేక్(ఫైల్)

యాదమరి: ద్విచక్రవాహనం అదుపు తప్పి చింత చెట్టును ఢీకొనడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన కొనాపల్లె క్రాస్ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ మునస్వామి కథనం మేరకు.. చిత్తూరు రూరల్ మురకంబట్టు అగ్రహారానికి చెందిన వివేక్(27) బుధవారం అర్ధరాత్రి యాదమరిలో పూజా కార్యక్రమానికి హాజరై, చిత్తూరుకు ద్విచక్రవాహనంలో తిరుగు పయనం అయ్యాడు. కొనాపల్లె క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చింతచెట్టును ఢీ కొంది. ఈ సంఘటనలో అతడి తలకు తీవ్ర గాయం అయ్యింది. ఈ ప్రమాదాన్ని ఎవరూ గుర్తించక పోవడంతో తీవ్రరక్తస్రావం జరిగి వివేక్ అక్కడిక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం ఈ విషయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సోఫాల ఫ్యాక్టరీ దగ్ధం



కాలుతున్న సోఫాల తయారీ ఫ్యాక్టరీ

వి.కోట: సోఫాల ఫ్యాక్టరీ దగ్ధమై రూ. 20 లక్షల ఆస్తినష్టం జరిగిన సంఘటన వి.కోట పట్టణంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని కెజీఎఫ్ రోడ్డులో గాండ్లపల్లె కొత్తూరు గ్రామానికి చెందిన సయ్యద్ బాషా అనే వ్యక్తి పాత కోళ్ల ఫారం షెడ్డులో సోఫాల తయారీ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఉన్నట్టుండి మంటలు రేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు గుర్తించి, షెడ్డు యజమానికి సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ, విద్యుత్, పోలీస్‌శాఖాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే రూ.20 లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయి.

మద్యం కేసులో మహిళ అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తున్న దంపతులను పోలీసులు వెంబడించగా భర్త పారిపోయాడు. భార్యను పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఎస్‌ఈబీ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. బంగారుపాళెం మండలం కామాక్షిపురం క్రాస్ వద్ద గురువారం ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఓ ద్విచక్రవాహనంలో టేకుమందకు చెందిన లోకేష్(35), అతని భార్య హరిత (25) కర్ణాటక మద్యం 96 ప్యాకెట్లను తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. భార్యను వదలి లోకేష్ పారిపోయాడు. పోలీసులు నిందితురాలు హరితను అరెస్టు చేసి వాహనం, మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాలతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. లోకేష్‌పై కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, రేఖ, మమత తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంలో వరసిద్ధుడి విహారం





స్వర్ణరథంలో విహరిస్తున్న వినాయకస్వామి, సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు, ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామివారు స్వర్ణరథంలో కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో విహరించారు. గురువారం రాత్రి సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని ఉత్సవ మూర్తులను అలంకార మండపం నుంచి ఊరేగింపుగా వేంచేపు చేసి, స్వర్ణ రథంలో కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు సార్లు ఆలయంలో అర్చకులు సంకటహర చతుర్థి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట సిద్ధి,బుద్ధి, సమేత వినాయకస్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా వేంచేపు చేసి, ఆస్థాన మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలోనూ గెలుపు సాధ్యమే



జెండా ఎగుర వేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే కుప్పంలోనూ గెలుపు సాధ్యమేనని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. పచ్చపార్టీ ప్రలోభాలకు తలొగ్గకుండా పనిచేస్తే రాబోవు ఎన్నికల్లో కుప్పంలో గెలుపు అంత కష్టమేమి కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రికి సాధ్యం కాని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. మనం చేయాల్సిందల్లా మన పథకాలను ప్రజలకు వివరించడమేనని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం పార్టీ కార్యకర్తలు, వారి బంధువులు మాత్రమే బాగుపడ్డారని, జగనన్న పాలనలో పేదలు, బడుగులే ప్రామాణికంగా పథకాలు పంపిణీ జరుగుతోందన్నారు. ఎన్నో ఆర్థిక కష్టాలను ఓర్చుకుని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అలాంటి ముఖ్యమంత్రికి రాబోవు ఎన్నికల్లో ఒక ఓటు వేసి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న, మన బాగోగులు చూసుకునే వ్యక్తులను మనం ఆదరించాలని కోరారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్, మోహన్, ప్రభాకర్, రత్న పాల్గొన్నారు.

ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి దాతృత్వం



ప్రశాంత్ నగర్ వద్ద హిటాచీ యంత్రంతో జరుగుతున్న రోడ్డు పనులు



మాపాక్షి వద్ద రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న గ్రామస్తులు

- రూ.5 లక్షల సొంత నిధులతో రోడ్ల నిర్మాణం

చిత్తూరు రూరల్: నగరంలో దాదాపు రూ.5 లక్షల వ్యయంతో ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి రెండు రోడ్లను పునర్నిర్మిస్తున్నారు. నగరంలోని ప్రశాంత్ నగర్ కాలనీలో ఓ వీధికి స్కూటర్లు సైతం వెళ్లడానికి వీలులేకుండా కొండ చరియలు ఉండడంతో వాటిని తొలగించి, కచ్చా రోడ్డు వేయిస్తున్నారు. అలాగే మాపాక్షి రోడ్డులోని అనుపల్లె సమీప ప్రాంతాల్లో దాదాపు 150 కుటుంబాలు 7 కిలోమీటర్ల దూరం చుట్టుకుని శ్మశానవాటికకు వెళ్లాల్సి ఉంది. దీనికి దగ్గరగా మరో రోడ్డును కూడా విజయానంద రెడ్డి వేయిస్తున్నారు. తన సొంత నిధుల్లో దాదాపు రూ.5 లక్షల వెచ్చించి ప్రజల సౌకర్యార్థం ఈ రెండు రోడ్లనువేయిస్తున్నట్లు విజయానందరెడ్డి తెలిపారు.

అధిక పాల దిగుబడికి కృషి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా జిల్లాలో అధిక పాల దిగుబడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో వెలుగు, సహకార, పశుసంవర్ధకశాఖల సిబ్బందికి జగనన్న పాల వెల్లువలో భాగంగా పశువుల కొనుగోలుకు రుణాలు, బ్యాంకుల సహకారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఆవుల కొనుగోలుకు ముందుకు వచ్చే రైతులకు సత్వరమే బ్యాంకు రుణాలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. బ్యాంకు రుణం ద్వారా పశువులను కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా అమూల్ డెయిరీకి పాలు పోసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా జిల్లాలో పాలసేకరణ శాతాన్ని పెంపొందించాలన్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల వారీగా పాడి రైతులతో సమావేశాలు నిర్వహించి, అధిక సంఖ్యలో పశువుల కొనుగోలుకు రైతులు ముందుకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పశు వైద్యాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీసులకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఐడీఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ సుందర్‌రాజన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయన కుమార్తెకు రూ.50 వేలు, ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కిడ్నీలో రాళ్ల సమస్యతో చికిత్స తీసుకున్న పురుషోత్తానికి రూ.50 వేలు చొప్పున చెక్కులను అందజేశారు.

వేధింపుల కేసులో ఐదేళ్ల జైలు

చిత్తూరు అర్బన్: బాలికను లైంగికంగా వేధించిన కేసులో నాదముని (40)కి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక పోక్సో కోర్టు గురువారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం మేరకు.. తిరుపతి జిల్లా తిరుచానూరు పంచాయతీ పాడిపేటకు చెందిన నాదముని ప్రైవేటుగా కరెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2020 జూన్ 5న తన కుమార్తె పుట్టిన రోజును జరుపుకున్నాడు. ఈ క్రమంలో వేడుకలకు వచ్చిన బాలికను లైంగికంగా వేధించాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని బాలలపై లైంగిక దాడుల నివారణ (పోక్సో) ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు.

యువతి అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన జెన్నీఫర్ (25) అనే యువతి కనిపించడంలేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. గిరింపేటకు చెందిన జెన్నిఫర్ ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. గురువారం ఉదయం కళాశాలకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఉత్కంఠకు విరామం

– అపోలో, ప్రభుత్వాస్పత్రి అధికారుల సమావేశం వాయిదా

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వాస్పత్రి సమన్వయ లోపంపై శుక్రవారం విజయవాడలో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. ఈనెల 12వ తేదీకి సమావేశం వాయిదా వేసినట్లు అధికారులు చెబుతున్నారు. నవంబర్ 14వ తేదీ ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం గత నెల 17వ తేదీ విజయవాడలో అపోలో, ప్రభుత్వాస్పత్రి అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సమక్షంలో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశం ఓ కొలిక్కి రాకపోవడంతో సమీక్షను డిసెంబర్ ఒకటో తేదీకి వాయిదా వేశారు. అప్పటి నుంచి ఆస్పత్రి వైద్యులు, అధికారుల్లో ఉత్కంఠత నెలకొంది. ఆస్పత్రి బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే టెన్షన్ నెలకొంది. కాగా ఈనెల 12వ తేదీకి సమీక్ష వాయిదా పడిందని తెలియడంతో ఉత్కంఠతకు విరామం వచ్చింది.

యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చిత్తూరు నగరంలోని మంగసముద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు.. మంగసముద్రం ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ (35) అనే యువకుడు ఓ మెడికల్ కంపెనీ రెప్రెజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆస్తి విషయమై తన తల్లితో గొడవపడి, సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడి భార్య నిండు గర్భిణి.